# దొరికిన రూపాయలు

అంతరరాష్ట్రీయ ఋణ సేకరణ సంస్థా, అఖిల భారత అప్పులు ఎగవేసేవారి సమాఖ్యా సమకాలిక సోదర సంస్థలు. ఒక దానిలో గౌరవ సభ్యులు మరో దానిలో బోర్డు డైరెక్టర్లు. ఒక దానిలోని కార్యవర్గ సంధాన కర్తలు మరో దానిలో 'అడ్-హాక్' కమిటీని ఆక్రమించారు. ఋణ సేకరణసంస్థ తాలూకు కార్యాచరణ సమితిలో పాల్గొనే వారు ఎగవేసే సమాఖ్య తాలూకు 'రన్నింగ్ కమిటీ'కి ఎన్నికయ్యేవారు.

పై సంస్థల తాలూకు ఫౌండరూ, శాశ్వత సభ్యులూ అయిన శ్రీవారూ, కోనేటిరావూ, విశ్వంభరుడూ, సూర్యం ఆంధ్ర దేశంలో పుట్టి పక్కా ఆంధ్రత్వంలో (తో) పెరిగి, ఆంధ్ర దేశపు గడ్డమీద వుద్యోగం వెలిగిస్తూ సద్యోగం చేస్తున్న ఆంధ్ర జాతి మణిపూసలు—శ్రీ వారికి... నేను, వాడు, మా వాడనీ; కోనేటిరావుకు... కోనేటి, కోనిగాడు, కోనారావనీ; విశ్వంభరునికి... విస్సిగాడు, విశ్వంభరి గాడనీ; సూర్యానికి... సూరిగాడు, సూరయ్యనీ మారు పేర్లు చెలామణీలో వున్నాయి.

పై సంస్థల విస్తృత కార్యక్రమంలో మా నలుగురి పంథాలూ, థియరీలు, థీసిస్‌లూ, వేరైనా... ధ్యేయం ఒకటే కాబట్టి గమనం వేరైనా గమ్యం ఒకటే అవుతోంది.

మా సంఘానికి ముఖ్య బాంకర్లు—విస్సిగాడి మేనమామ, చిల్లరకొట్టు సీతయ్యా. అదట్లా వుండనీండి.

ఈ వుద్యమంలో తల నెరిసిన శ్రీవారూ, విశ్వంభరుడూ ధనం సేకరించటానికి బయలు వెడలే ఫక్కీయే వేరు. వెళుతుంటేనే ముఖం బిగుసుకు పోతుంది. 'సీరియస్ నెస్' పిలిచి నట్లుగా పరుగెత్తుకొస్తుంది. వీడేదో బ్రహ్మాండమైన ఆపదలో చిక్కుకున్నాడని ఎదుట వాడిమీద 'మహా ఇదిగా' ఇంప్రెస్ చేసేస్తాం. అంతవరకూ మా యిద్దరి పంథా ఒకటే. అర్జీ పడెయ్యటంలోనే వున్న భేదమంతా...

"ఇదుగో మూర్తీ... మళ్ళీ లేపిచ్చేస్తా!... ఓ ఫైవర్ పడేయ్... చాలా అర్జంటు..." అని శ్రీవారు ఉటంకిస్తారు.

"ఏరోయ్ మూర్తీ... నే నడిగింది ఏం చేశావ్?... ప్చ్!... నువ్వన్నీ ఇంతే!... ఎబ్బే... నరే ఎడ్వాన్సు బుకింగ్ ఓ ఫైవ్ చిప్స్ జార్చు..." అని విశ్వంభరిగాడు సాగి పోతాడు.

"ఓయ్ మూర్తీ... అఫ్నోయ్ పరీక్ష కెళ్ళావుగావును ఎట్లా వ్రాశావేమిటి?... పిల్లా మేకా అంతా కులాసా!... ఇంటి కాడినించి వుత్తరం వచ్చిందీ?... అవును గాని మూర్తీ... చాలా అవసరమోయ్... అయిదు రూపాయిలివ్వు... మళ్ళీ నెలాఖరుకు సర్దేస్తా... ఏమిటి... కాదనవులే!... నాకు తెలుసుగా (కొంచంగా నవ్వుతాడీ సమయంలో... వీడి మొఖంమండ... నవ్వెట్లా వస్తుందో?!)—మూర్తీ...... ఇదుగో చూసావ్" అని కోనిగా డుపక్రమిస్తాడు.

ఇక మా సూరిగాడి పద్ధతి మరీ బరితెగిన పద్ధతి "ఏయ్ మూర్తీ—ఒకయిదు రూపాయిలిట్లాతే!..." అని టక్కీమని బాకీవున్నట్లు పేల్చినట్లు అడిగేస్తాడు.

ఇవీ సేకరణ పద్ధతిలో మాలోని భేదాలు.. ఇక ఎగవేసే కార్యక్రమంలో ముందంజ కోనేటిరావుదే...

## "వసంత్ విహార్"

"సారీ!—మూర్తీ, ఈ నెల్లో సర్దలేక పోయాను ... మరేమనుకోకు ... సరేగానే ఇంకా ఆ హోటలు మెతుకులే గతుకు తున్నావా ... అది మరీ పాడు అ!... కాదూ? !..."

"నాట్ మిస్టర్ మూర్తీ... ఎడ్జస్ట్‌మెంట్ కుదరక చస్తున్నానోయ్... ఈ నెల్లోకూడా ఓ 'టెనర్' పడే ... రెండూ... కలిపి..." అని శ్రీ వారు రెండోదానికి పాచిక వేసి మొదటి దానికి ఎసరు పెడతారు.

"డామిట్!... మా అంకుల్ యమ్. ఓ. చేస్తానన్నాడు. ఎందుకనో చెయ్యలేదు... టెలిగ్రామన్నా ఇవ్వాలి టి. యమ్. ఓ. చెయ్యమని. అది నయం కాదు మూర్తీ!..." అని సలహా అడుగుతాడు మా విశ్వంభరిగాడు.

"అమ్మ బాబోయ్... మూర్తల్లేవుండే!.." అని ఎగిరి గంతేసి పక్క సందులోకి దూరతాడు మా సూరిగాడు. అదే వాడిదగ్గరున్న వెనవకుణం "భయమేమిట్రా నాయనా! మమ్మల్ని చూడు ... ఎంచక్కా ... మాలా..." అని చెప్పినా సరే సాగివస్తున్న వాడెవ్వడ్నా వాడ్ని చూసి జారుకుంటాడు.

"ఎబ్బే ఇట్లా అయితే వీళ్ళి కార్యవర్గం నుంచి బహిష్కరణ్ చెయ్యాల్సిందే" అని రిమార్కిస్తాడు విస్సిగాడు.

* * *

ఈ మా సంఘాల కార్యక్రమం వగైరాలు మీ ముందుంచుతున్నానంటే సంఘాల తాలూకు 'పబ్లిసిటీ ఇన్‌ఛార్జి'గా నా 'కుండు కున్నట్టి' బాధ్యతని దులపరించుకు పోదామనే దురుద్దేశ్యం నాలో ఏ కోశానా కంచు కాగడా వేసి వెదికినా కన్పడదు. ఈ మధ్య మా మీద వ్యక్తిగతంగానూ, సంఘ పరంగానూ ప్రచారమవుతున్న దుష్ప్రచారాల్ని ఖండించి, నిజాన్ని మీ ముందుంచటమే నా వుద్దేశ్యం...

అయితే మీరేమన్నా అనుకోండి... ఈ రోజున మేం యీ సంఘాల్నించి మూకుమ్మడిగా తప్పుకున్నాం, ప్రతిచోటా, ప్రతి మధ్యతరగతి కుటుంబమున్న చోటా యీ సంఘాల తాలూకు శాఖలో, పాయలో విలసిల్లక మానవు...

అజేయమైన, శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైన, మా సంఘాల ధ్యేయం పరమోత్కృష్టమైందని నేను వేరేఘోషించక్కర్లేదు. మూర్తిగాకపోతే శాస్త్రి, లేక శర్మ... రావు ...చౌదరి ... నాయుడు ... సులేమాన్, పీటర్ ఎవరో ఒకరు దారిన పొయ్యే దానయ్యలు ... ఎవడైతేనేం, స్తోమత కావాలి, మర్యాద తెలిసుండాలి. అంతే...

"అసలింతకీ ఇదంతా ఎందుకు చెప్పొచ్చానంటే ఆరోజు మా క్కావాల్సిన రెండు రూపాయలు 'బ్రహ్మప్రళయం' వచ్చినా దొరకలేదు. దొరుకుతాయనే నమ్మకం కూడా లేదు.

కాని ఓ ఘోరస్వప్నం జరిగింది. ఆవాళ సాయంత్రం కోనేటిరావు ఇంటి కెళుతూ నేలమీద ఏదో పోయినట్లు వెతుక్కుంటున్నట్టు వెడుతుంటే... బాగా ఎరుగున్నాయన ఎవరో...

"ఏమిటండీ వెతుకుతున్నారు." అని అడిగాట్ట... ఎరక్క... నేరక... కోనిగాడు దిక్కుముఖంవేసి జేబు తడుముకుంటూ...

# దొరికిన రూపాయలు

"రెండు రూపాయ..." అన్నాట్ట మాట సగలక మింగుతూ...

"అరెరె!...పాపం. పోన్లెండి...అవెక్కడ దొరుకుతయ్...నే నిస్తాన్లెండి... ఇంటికొచ్చి వాళ్ళిచ్చినవిప్పట్టుకెళ్లండి...తర్వాత సర్దుదురుగాని... దానికేమిటి లెండి... అవి ఎవడికో దొరికుంటాయ్..." అని కోనేటిని మాట్లాడనీకుండా రెండు కాగితం ఒకటి చేతిలో కుక్కి ఎవరినో పిలుస్తూ గబ గబా వెళ్ళిపోయాట్ట.

మావాడు గుడ్లు పెద్దవిచేసి, 'కలా... నిజమా' అని చెయ్యిచూసుకొని, గిల్లుకొని గుప్పిడి గట్టిగా మూసి పరుగెత్తుకొచ్చి నా ముందు వాలాడు... మాటా మంతీ లేకుండా రోజుతూ... రొప్పుతూ... ఆ రెండు కాగితం చూపించి గుడ్లప్పగించాడు.

"ఏమిట్రా అబ్బీ — యీ హడావుడి: ఇదెక్కడిది!...?" అని ఆశ్చర్యంగా అడిగా—

"వెధవ లేదని అబద్ధమాడాడు...అది తెలుసుకుట్టినట్టు కుట్టి ఇక్కడకు తోలుకొచ్చింది. లేకపోతే సంఘాన్ని మోసం చేస్తాడా... అకటా;..."

"ఏంరా బాబూ!... ఎక్కడన్నా జేబు కొట్టలేదుకదా!... ఓరే సూరీ అటు చూడు... ఎవరన్నా పోలీసు ఇటు వస్తున్నాడేమో..." అని సూరిగాడూ, విశ్వంభరుడూ వాణ్ణి ముంచేస్తున్నారు.

"ఆగండిరా బాబు. వాణ్ణి చెప్పనీండి.." అన్నా నేను. వాడాపాటిన కథంతా వెళ్ళగక్కాడు...

"ఎవర్రా ఆయన?"


"నేను బజారు వెంబడి వెతుక్కుంటూ వెళుతుంటే... 'ఎందుకు వెతుకుతావు లేవయ్యా... పోయింది దొరుకుతుందా... నేనిస్తా లేవు సర్దుకుపుగాన్లే...' అని ఇచ్చార్రా!..."

"నువ్వు బజారువెంబడి దేన్ని వెతుకుతున్నావ్?..."

"మనకి రెండు రూపాయలెక్కడా దొరకలేదుగా!... రోడ్డు వెంబడ వాన్న ఎవరన్నా పోగొట్టుకున్నారా... మనకు దొరక్కపోతుందా...అని వెతుకుతూ వెళ్లాను..."


"అరి పిడుగా!... ఓరే కార్యదర్శి... కోనేటిరావును బోర్డు ఛైర్మన్ గానూ, ఆ సీతయ్యగార్ని ఎఫిలియేట్ ఛాంకర్ గానూ మన లిస్టులో చేర్చు... ఒరే కోనేటి రేపు బోర్డు మీటింగ్‌లో నువ్వు 'అప్పు చెయ్యటం' అనే దానిమీద నీ 'థీసిస్' చదువు..." అన్నా నేను [illegible]. ★

SISTA'S - AML - 33 - TEL




"టినోపాల్" తెల్ల బట్టలకు అధిక కాంతినిస్తుందనడం నిజం.
కొద్దిగా టినోపాల్ ఒక్కసారి ఉపయోగించితే మూడు నాలుగు ఉతుకుల వరకూ సరిపోతుంది.

టినోపాల్ ఉపయోగించిన తెల్లని బట్టలు అన్నిటికన్నా తెల్లనైనవి.



టినోపాల్

"టినోపాల్" జె. ఆర్. గాయగి, యస్.ఏ. బాల్ స్విట్జర్లాండ్‌వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్.

అమాల్గమేటెడ్ కెమికల్స్ అండ్ డైస్టఫ్స్ కం. ప్రైవేట్ లి.
పోస్ట్ బాక్స్ 965 బొంబాయి.